# శ్రీ వేంకటేశ్వరాంజనేయ యుద్ధం

*...కరక్టేనండి - మీరు విన్నదీ, నేను అన్నదీ అదేనండి - శ్రీ రామాంజనేయ యుద్ధమనలేదు; శ్రీ వేంకటేశ్వరాంజనేయ యుద్ధమనే అన్నాను. వేంకటేశ్వరస్వామి వారికి, ఆంజనేయస్వామి వారికి ఎప్పుడూ యుద్ధం జరగలేదంటారా? తమరికి తెలియక పోవచ్చు. మా ఊళ్లో నిజంగానే పెద్ద ఫైటింగైపోయిందండి. ఆ విషయమే మనవిజేస్తుండే తమరు అడ్డుప్రశ్న లేస్తున్నారండి!*

కాలవపతల పాకలమధ్య ఆంజనేయస్వామి గుడి చూసే వుంటారు తమరు - మా ఊరు వచ్చినప్పుడు. గుడంటే పెద్దగుడేం కాదు, ఇటుకలతో కట్టిన చిన్నమందిరమన్నమాట. ఎవరు, ఎప్పుడు కట్టించారో తెలియదు కాని పూజాపునస్కారాలు లేక పాడుపడిపోయి చపుడురాలుతూ ఉండేది. ఆ గుడికి తలుపులుండేవి కావు. అప్పుడు ఆంజనేయస్వామి వుండేవారో లేదో మనకు తెలియదు కాని, గాడిదలు, ఊరకుక్కలు ఆ గుళ్లో పడుకుంటుండేవి. అంత హీనస్థితిలో వుండేదన్న మాట.

ఆ గుడి సరిగ్గా రామబ్రహ్మంగారింటి ఎదురుగా వుండేది.

రామబ్రహ్మంగార్ని మీరు చూశారా? కండలు తిరిగిన ఆంజనేయ స్వామిలా ఉంటాడు. ఆయనకు ఏడుగురు కొడుకులు. వాళ్లని చూస్తే వానర సైన్యాన్ని చూసినట్లు చూడముచ్చటగా వుండేది.

రామబ్రహ్మంగారికీ ఆంజనేయస్వామివారికీ లింకేవిటో చెప్పడం మరిచిపోయాను.. సార్! ఓ రోజు రాత్రి స్వామి ఆయన కలలో కన్పించి, 'నన్ను పూజా పునస్కారాలు లేకుండా అలాగే ఉంచేస్తారా?' అని కోప్పడ్డారట. వెంటనే రామబ్రహ్మంగారు సొంతఖర్చుతో అంతవరకూ కళాకాంతులు లేని గుడిని బాగుచేయించి రంగులు వేయించారు. గుడిముందు స్టేజీలాగ పెద్ద అరుగు కట్టించారు. రామబ్రహ్మంగారూ, బాలాంజనేయులూ గుడి అరుగుమీద కూర్చుని భజన చేస్తుంటే కన్నులపండువుగా ఉండేదిలెండి.

అయ్యా? ఆ తర్వాత గుడికి దశ అందుకుందండి.

రామబ్రహ్మంగారికి ఆంజనేయస్వామివారు అడపాదడపా పూనడం మొదలు పెట్టారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి, దీవనలు, తాయత్తులు తీసుకుపోతుండేవారు. దెయ్యాలు, భూతాలు వదిలించుకుంటుండేవారు. మంగళవారం వస్తే - చెబితే నమ్మరు కాని అక్కడ అరమైలు క్యూ ఉండేది.

రామబ్రహ్మంగారు పూనుకోడంతో స్వామివారి దశ తిరిగినట్లు, స్వామివారి చలవవలన రామబ్రహ్మంగారి దశకూడా తిరిగిందండి. దేశాలమ్మ, మావిళ్లమ్మ, నూకాలమ్మ, పుంతలో ముసలమ్మలాంటి చిన్న చిన్న వార్డు దేవతలందరూ వెలవెలబోతుండగా ఆంజనేయస్వామివారు కళకళలాడుతూ లేచారండి.

అయితే కాలం ఎప్పుడూ ఒకేలాగుండదు కదండీ!?

ఉన్నట్లుండి కాలవవతల, కుళాయి చెరువు ప్రక్కన, పరబ్రహ్మంగారింట్లో ఓ రోజు రాత్రి శ్రీవేంకటేశ్వర స్వామివారు అట్టహాసంగా మేళతాళాలతో వెలిశారు.

పెద్ద తిరపతి, చిన్న తిరపతి, అప్పనపల్లి తర్వాత కొత్త బ్రాంచీ ఒకటి మా ఊళ్లో వెలియగానే జనాలు తండోపతండాలుగా వచ్చి పడిపోవడం మొదలుపెట్టారు. శ్రీవేంకటేశ్వరస్వామివారి వైభవం చూడడానికి రెండు కళ్లూ చాలవండి. దేవుళ్లలో సూపర్‌స్టార్ ఆయనేకదండీ... అంచేత జనం ఇసకేస్తే రాలనట్లుండేవారు.

కొబ్బరికాయలు, పూజసామాను, స్వామివారి పటాలు, గొలుసులు, ఉంగరాలు, రంగు రంగుల ట్యూబులైట్లు, నక్షత్రాల్లా వెలిగి ఆరే రంగు రంగుల దీపాల తోరణాలు, అదంతా గొప్ప బిజినెస్ సెంటర్లా ఉండేది.

కొత్త వంతెన మీంచి చూస్తే కుళాయి చెరువుగట్టు పైన ఎత్తుగా చిన్న చిన్న బల్బులతో అలంకరించిన స్వామివారి చిహ్నాలు ఆకాశంలో వెలిగిపోతూ కన్పించేవి. చిన్నారావుగాడు ఆడి నేక్ అంతా ఉపయోగించి అలాంటి లైటింగిచ్చాడండి.

మరికొన్ని రోజులు పోయేటప్పటికి పరబ్రహ్మంగారికి శ్రీవేంకటేశ్వర స్వామి వారు పూనడం ప్రారంభించారు. అందరూ స్వామివారి మహిమల గురించి చెప్పుకోడం మొదలుపెట్టారు. నిజవెంతో మనకు తెలియదు కాని

స్వామివారికి మొక్కుకుంటే చలమయ్యగారి మూడో అమ్మాయికి - నల్లగా, పొట్టిగా, చింతపండు బుట్టలా వుంటుందే, ఆ అమ్మాయండి - పెళ్లి జరిగిందనీ, చెయిర్మన్‌గారి మేనమామ నిలువుదోపిడీ ఇస్తే ఆయనకు కేన్సర్ నయమయిందని చెప్పుకునేవారు. ఇలాంటివన్నీ వీనులవిందుగా వినే భక్తుల పారవశ్యానికి అడ్డులేకపోయింది.

కొత్త సినిమా రిలీజ్ అయితే పాతసినిమాకి జనం తగ్గిపోయినట్లు శ్రీవేంకటేశ్వరస్వామివారు ట్యూబ్‌లైట్లతో, చలువపందిళ్లతో, తళ తళలతో రంగంలో దిగే సరికి కాలవిపతల ఆంజనేయస్వామి గుడి దగ్గర జనం పలచబడిపోయారు. వాళ్లంతా పార్టీ మార్చేసి కాలపదాటి శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనానికి పోవడం మొదలుపెట్టారు.

ముందున్న చెవులకంటే వెనకొచ్చిన కొమ్ములవాడి ఎక్కువయేటప్పటికి, 'రామాయణ కాలంనాటినుంచి వున్నవాణ్ణి నన్ను నిర్లక్ష్యం చేస్తా(రా' అని ఆంజనేయస్వామివారికి ఆగ్రహం వచ్చేసి రామబ్రహ్మంగారిద్వారా వేంకటేశ్వర స్వామివారికి వార్నింగిచ్చాడు.

వేంకటేశ్వరస్వామివారు ఊరుకుంటారా?

ఆయన ఆంజనేయస్వామికి తిరుగువార్నింగిప్పించేశారు. తమరికో చిన్న లిటిగేషన్ చెప్పడం మర్చిపోయాను!

కాలవివతలంతా దానయ్యగారి రాజ్యమండీ, దానయ్యగారంటే మా మునిసిపాలిటీ వైస్-చెయిర్మనండి. కాలవ అవతలంతా చెయిర్మన్‌గారి రాజ్యం. ఆళ్లిద్దరూ ఒకే వరలో రెండు కత్తుల్లా, ఒకే పార్టీవాళ్లండి.

ఫైటింగు చెయ్యడానికి ఆపోజిషను వాళ్లెవరూ భూతద్దం వేసి చూసినా దొరక్కపోతే ఆళ్లలో ఆళ్లే కొట్టుకు చావక ఏం చేస్తారండీ?

తమరాజ్యం నుంచి మరోరాజ్యానికి ప్రజలు వెళ్లిపోతుంటే దేవుళ్లకే కాదు - మనుషులకీ కోపం వస్తుంది. ఈవేళ వేంకటేశ్వరస్వామికి జై కొట్టినోళ్లు రేపు ఆయన్ని బేక్ చేసిన చెయిర్మన్‌గారికి జై అనే ప్రమాదం వుంది కదండి. అంచేత ఆంజనేయస్వామివారితోపాటుగా దానయ్యగారికి కూడా ఆగ్రహం వచ్చిందండి.

ఇలా మెల్లిమెల్లిగా దేవుళ్లిద్దరిమధ్యా, ఆళ్ల సపోర్టర్ల మధ్యా నిప్పురాజుకుందండి.

ఓరోజు లంకాదహనం నాటకం వేస్తే - చూడ్డానిక్కాదు కదా -

కనీసం తెర తియ్యడానికి కూడా మనుషులు లేకుండా పోయారు. రెండో ఆంజనేయులు, 'నేను తెల్లారకట్ట కదరా స్టేజీ ఎక్కేది' అని వాడుకూడా కాలవ అవతల లంకా దహనానికి పోటీగా పెనుగొండాళ్ల రికార్డింగుడాన్సు పెడితే చూడ్డానికి వెళ్లిపోయాడు.

రాత్రి పదకొండయినా తెరెత్తుదామంటే మనిషి కనుపించలేదు.

భజన అయిన తర్వాత పళ్లెంపడితే ఆనవాయితీగా రామబ్రహ్మంగారు వేసిన రెండు రూపాయల నోటుకాకుండా తొంభైపైసలు పచ్చాయండి. నేను ఆ టైంలో అక్కడే వున్నాను కనుక తమరికి అంతా వివరంగా మనవి చెయ్యగలుగుతున్నాను.

గుడిముందు వేసిన చిన్నపందిరిలో వున్న ఒకే ఒక ట్యూబులైటు చుట్టూరా దీపం పురుగులు తిరుగుతున్నాయి. పాత స్పీకరులోంచి 'కోతివాడపు నిన్నుచూడ - అబ్బ రోత పుడుతోంది పోపోరా' అని పాట గీరగా వినిపిస్తోంది. ఇదంతా చూస్తున్న సామాన్యభక్తుణ్ణి నాకే చాలా బాధకలిగితే మహాభక్తులు రామబ్రహ్మంగారికెలా వుంటుది చెప్పండి?

పళ్లెంలో చిల్లరకేసీ, వెలుగుతున్న దీపంకేసి దీక్షగా అలాగే చూస్తున్న రామబ్రహ్మంగారి మొహం రాగిడబ్బులా ఎర్రబడింది. ఒక్కసారి జూలు విదిలించిన సింహంలా తలెత్తి కాలవ అవతలివేపు చూశారు.

అలా చూస్తుండగానే ఆంజనేయస్వామివారు రామబ్రహ్మంగారిమీదకు దిగిపోయారు. పళ్లెంలో కుంకుమ పిడికిలితో తీసి మొహం నిండా పూసేసుకుని, ఉగ్రావతారం దాల్చి, గద భుజంమీద వేసుకుని, మేకప్ పూర్తిచేసుకుని కునికిపాట్లు పడుతున్న ఒకటో ఆంజనేయులి తోక పీకి తను తగిలించుకుని, కాల్వ ఒడ్డుకు నడిచారు రామబ్రహ్మంగారు.

ఆయనతోపాటు ఆయన సైన్యం, బాలాంజనేయులతో సహా, చేతి కందినది తీసుకుని బయలుదేరింది. నాకదంతా చూస్తుంటే అలనాటి రామరావణ యుద్ధసన్నాహమంతా కళ్లముందు మెదిలింది.

కాల్వ ఒడ్డున నుంచుని అవతలివైపు చూస్తే సముద్రానికవతల బంగారులంకలా శ్రీ వేంకటేశ్వరవైభవం తళ తళ మెరిసిపోతూ కనిపించింది.

'ఓ సుబ్బారావు, ఓ రంగారావు, ఓ వెంకట్రావు' అంటూ పెనుగొండ ట్రూపు అర్ధనగ్నంగా డాన్సుచేస్తూ అందర్నీ పేరుపేరున స్వామివారి దర్శనానికి పిలుస్తోంది. పెనుగొండాళ్లని దెబ్బతియ్యాలంటే రాజమండ్రి విజయకుమార్‌గాడి ట్రూపు రంగంలోకి దిగాలికాని లంకాదహనం

ఏమాగుతుందండి? అడవి రాముడి బొమ్మముందు కృష్ణప్రేమ తుస్సుమన్నట్లు తుస్సుమంటుంది గదా!

పెనుగొండాళ్ల పిలుపువిని ఇహపరచింతనతో రంగారావులు, సుబ్బారావులు, వెంకట్రావులు పరుగులు తీస్తుంటే కాలువ ఇవతల రామబ్రహ్మంగారి మైకు సెట్టులోంచి, 'లేవయ్యా, లేవయ్యా, లేరయ్యా నీసాటి నీవేగ రావయ్య వీరాంజనేయా' అన్నపాట వినిపిస్తోంది.

ఆ పాట వింటూనే ఆంజనేయస్వామివారు ఛాతీ పొంగించి, గద భుజంమీంచి కిందకు దింపి నేలమీద ఆనించి, దిక్కులు పిక్కటిల్లేలా హుంకారం చేశారు. ఆ సమయంలో ఆయన్ని, బాలాంజనేయుల్ని చూస్తే లంకమీదికి యుద్ధానికి వెడుతున్న వానరసైన్యాన్ని మరి చూడనక్కర్లేదు.

'సముద్రమే నీకొక సెలయేరుకాగా అవలీల దానిని దరియింపలేవా...'

ఆంజనేయస్వామివారు మీసం దువ్వి భక్తులకేసి చూసి 'అంటించండి' అన్నారు. భక్తులు నూనె గుడ్డలు స్వామివారి తోకకి చుట్టి అంటించి వదిలారు.

'జై భజరంగబలీ' అని భక్తులు స్తోత్రం చేస్తుండగా ఆంజనేయస్వామివారు వీరావేశంతో ఒక్క దూకులో కాలవ లంఘించి, వార్డుమీద రికార్డింగు డాన్సు పందిట్లోకి మేకల మధ్య పులిలా దిగినట్లు దిగారు.

ఆంజనేయస్వామివారు ఘోటక బ్రహ్మచారి. ఆయనకు ఆడగాలి పడదు కదా! అందులోనూ కట్‌డ్రాయర్లు, బ్రాసియర్లు మాత్రమే కట్టుకుని తైతక్కలాడేవాళ్లని - వాళ్లు పరలోక సౌఖ్యాలకు మార్గం చూపించే పవిత్ర కార్యాన్ని నిర్వహిస్తున్నా - ఆయన అసలు సహించలేరు. అంచేత తోకతో పందిళ్లూ, తోరణాలూ అంటిస్తూ గదతో అడ్డువచ్చినవాళ్లను మోదుతూ పరమ ఉగ్రంగా శ్రీవేంకటేశ్వర స్వామివారిని వెతుక్కుంటూ పరిగెట్టారు. ఆయన వెనకాలే వానరసైన్యం విజృంభించి ఆయన వదిలేసిన కార్యాన్ని పూర్తిచెయ్యడం మొదలుపెట్టింది.

శ్రీవేంకటేశ్వరస్వామివారు పరబ్రహ్మంగారి మీద వాలి భక్తుల పూజలు విలాసంగా అందుకుంటుండగా ఆంజనేయస్వామివారు హఠాత్తుగా ప్రత్యక్షమై, తోక పైకి కిందకు ఓసారి ఆడించి, గదతో తలుపుమీద ఓ దరువువేసి యుద్ధనినాదం చేశారు.

శ్రీవేంకటేశ్వరస్వామివారు ఏదో ఇరువురిభార్యలతో సరససల్లాపాలాడుతూ ప్రశాంతంగా శృంగారజీవితం గడిపేవారే కాని ఆంజనేయస్వామివారిలా

సముద్రాలు దూకీ, పర్వతాలు మోసీ, తోకతో లంకని కాల్చేసీ, గుద్దుకో రాక్షసుణ్ణి చంపేసీ యుద్ధాలలో రాటుదేలినవారు కాదు కదా! అంచేత ఒకసారి కళ్లెత్తి ఆంజనేయస్వామి వార్ని తిలకించి చిరునవ్వు నవ్వి, ఆయన జేవురించిన మొహం చూసి కొంచెం కలవరం చెంది, లేచి నిలబడి క్షణంలో హాలులో మాయమై, మేడమెట్లమీద మెరుపులా అరక్షణం కనిపించి తమగదిలో ప్రవేశించి అదృశ్యమైపోయారు శ్రీవేంకటేశ్వర స్వామివారు.

తోక ఉపయోగించాలా, గద ఉపయోగించాలా అని తీవ్రంగా ఆలోచిస్తున్న ఆంజనేయస్వామివారు ఆశ్చర్యం నుంచి కోలుకుని, 'ఏయ్' అంటూ శ్రీవేంకటేశ్వర స్వామి వార్ని తరుముతూ మేడెక్కేసి మూసిన తలుపుల మీద గదతో మోదుతూ ఆయన్ను బయటికి రమ్మని సవాలుచేస్తుండగా భక్తులు కొబ్బరికాయలు కొట్టి, హారతులిచ్చి స్తోత్రంచేసి శాంతింపజేశారు. ఆయన శాంతించి తోక కాలవలో ముంచి ఆర్పేసి కాలవదాటి గుడికెళ్లిపోయారు.

సంఖ్యలో ఎక్కువయినా బలంలో తక్కువైన శ్రీవేంకటేశ్వరస్వామి వారి భక్తులకి చాలా దెబ్బలు తగిలాయండి. వాళ్లు పోలీసు రిపోర్టు కూడా ఇచ్చారు.

పోలీసులు రామబ్రహ్మంగారి మీద కేసు బుక్‌చెయ్యడానికి పోతే ఆయన చిరునవ్వు నవ్వి, 'నాకేం తెల్సు, కావాలంటే స్వామివార్ని కోర్టుకి తీసుకెళ్లండి' అన్నారు.

అపునన్నారు భక్తులు మరియు వైస్-చెయిర్మన్ దానయ్యగారూ.

చెయిర్మన్‌గారూ, దానయ్యగారూ జుట్టూ జుట్టూ పట్టుకునేసరికి పార్టీ పెద్దలు జుట్టుపీక్కుని రాజీచేశారండి!

రాజీ కండిషన్లేంటో మనకు తెలియదు కాని ఆళ్లిద్దరూ ఒకటైపోయాకా శ్రీవేంకటేశ్వరస్వామివార్ని లేపేశారు. ఆంజనేయస్వామివారి కళ కూడా మెల్లిమెల్లిగా తగ్గిపోయిందండి.

మనిషి దేవుళ్లని చల్లగా చూసినంతకాలం దేవుళ్ల ప్రభ వెలిగిపోతుంది. ఆదు దేవుడి మీద శీతకన్నేస్తే దేవుడి కళ తగ్గిపోక ఏమవుతుందండీ! మా ఊరోళ్లు నాస్తికులైపోయారా అంటారా?

బలేవోరే-

ఇప్పుడు మా ఊళ్లో సాయిభక్త సమాజం మహాజోరుగా నడుస్తోందిలెండి.

దానికి చైర్మన్‌గారు అధ్యక్షులూ,

దానయ్యగారు ఉపాధ్యక్షులూ,

రామబ్రహ్మంగారూ, పరబ్రహ్మంగారూ రైటుహాండూ, లెఫ్టు హాండూనూ -

అయ్యా అదీ సంగతి... మరి నన్నింకేమీ అడక్కండి మహాప్రభో!

['విపుల' డిసెంబరు 89/జనవరి 90 సౌజన్యంతో]

* * * *